పండగలా సాగుతోంది

- దుక్కి నుంచి కోతల వరకు యంత్రాలతో చురుగ్గా పనులు
- సబ్సిడీపై పారదర్శకంగా మంజూరు
- సత్ఫలితాలిస్తున్న సాగు విప్లవం

సామర్లకోట: వ్యవసాయం దండగ అన్న నాటి పాలకులకు నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గట్టి సమాధానం ఇస్తూ వ్యవసాయాన్ని నూరేళ్ల పండగలా తీర్చిదిద్దింది. గతంలో సాగులో అడుగడుగునా అడ్డంకులే. నకిలీ విత్తనాలు మొదలు, గిట్టుబాటు ధర లభించకపోవడం వరకు ప్రభుత్వ వైఫల్యం కనిపించేది. నేటి పరిస్థితి దానికి విభిన్నం. అడుగడుగునా సాగులో అన్నదాతకు అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నట్టే వ్యవసాయ రంగమూ వైఎస్సార్ సీపీ పాలనలో పురోగమిస్తోంది. గతంలో దుక్కి దున్నడం మొదలు, పంట కోతల వరకు ప్రతి దశలోనూ కూలీల అవసరం ఉండేది. అందరికీ పని కల్పించే విధానంలో భాగంగా ఉపాధి పనులు రావడంతో సహజంగానే కూలీల కొరత ఏర్పడుతుంది. దీంతో అన్నదాతకు యంత్రసాయం ఆవశ్యకమైంది. రాష్ట్రంలో ఆర్బీకే వ్యవస్థ రావడంతో యంత్రాలను సబ్సిడీపై అందజేస్తూ అన్నదాతకు ప్రభుత్వం చేదోడుగా నిలుస్తోంది. రైతులు కేవలం 10 శాతం నగదు చెల్లించి వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు అందజేస్తోంది. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ, 50 శాతం బ్యాంకుల రుణ సదుపాయం కల్పిస్తున్నారు. మండల పరిధిలోని 21 ఆర్బీకేల ద్వారా మొదటి విడతలో ఐదు గ్రూపులకు రూ.1.35 కోట్ల విలువైన వరికోత యంత్రాలు రూ.44 లక్షల సబ్సిడీతో ఇచ్చారు. అలాగే 13 గ్రూపులకు రూ.1,04,18,139 విలువైన ట్రాక్టరు, పవర్ టిల్లరు, కృషి ట్రాక్టర్లను రూ.37,16,400 సబ్సిడీతో అందజేశారు. ప్రస్తుతం ఆరు గ్రూపులకు రూ.68,74,558 విలువైన యంత్రాలను రూ.24,57,122 సబ్సిడీతో అందజేశారు. దీనికి తోడు సున్నా వడ్డీతో సాగుకు రుణాలు ఇవ్వడంతో తమపై భారం లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వ్యవసాయ ట్రాక్టర్లు అందుకున్న రైతులు

కూలీల కొరత తీరింది

రైతులందరికీ ఒకేసారి వ్యవసాయ కూలీల అవసరం ఏర్పడడంతో కూలీల కొరత ఉండేది. యంత్రాల సాయంతో సాగు పనులన్నీ చురుగ్గా సాగుతున్నాయి. రైతుల పక్షపాతిగా ఈ ప్రభుత్వం నిరూపించుకుంది. ట్రాక్టరును అద్దెకు ఇస్తూ రుణాలు తీర్చుకొంటాం.

– కొత్తపల్లి రంగ, రైతు, పీబీ దేవం



సంఘంగా ఏర్పడడంతో బాధ్యత పెరిగింది



రైతులు సంఘంగా ఏర్పడి యంత్రాలు తీసుకుని బాధ్యతతో నిర్వహిస్తున్నాం. తాము వినియోగించుకున్న తరువాత వాటిని ఇతరులకు అద్దె ప్రాతిపదికన ఇస్తూ సాయపడుతున్నాం. ఆ అద్దె బ్యాంకు రుణం చెల్లింపునకు ఉపయోగపడుతోంది.

– గొల్లపల్లి గంగాధరరావు, రైతు, వీకే రాయపురం

సత్వరమే యంత్రాల మంజూరు



ప్రభుత్వం సబ్సిడీతో యంత్రాలు అందజేయడం వల్ల రైతులపై భారం తగ్గుతుంది. ఆర్బీకేలో ట్రాక్టరు కోసం దరఖాస్తు చేసిన వెంటనే సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేసుకుని నెల రోజుల్లో ట్రాక్టరు ఇచ్చారు.

– జ్యోతుల సత్యనారాయణ, రైతు, ఉండూరు

పారదర్శకంగా పంపిణీ



రైతులకు కావలసిన యంత్రాలను పారదర్శకంగా అందజేస్తున్నాం. యంత్రం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే రైతు వివరాలను తమ సిబ్బంది సేకరించి త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

క్లుప్తంగా

శృంగార వల్లభా.. గోవిందా..



స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు రూ.3.39 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఘనంగా మరిడమ్మ ఉయ్యాల తాళ్ల ఉత్సవం



మరిడమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న గరగల నృత్యం

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ప్రారంభమయ్యే మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా నిర్వహించే ఉయ్యాల తాళ్ల ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఆనవాయితీ ప్రకారం పాత పెద్దాపురం నుంచి తాటిచెట్లకు తాళ్లు కట్టి పట్టణంలో ఊరేగించారు. భారీ జనంతో గరగల నృత్యం, డప్పులతో వార్డుల్లో తిరుగుతూ వాటిని అమ్మవారి గుడికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌ఐ వెలుగుల సురేష్ పర్యవేక్షణలో బందోబస్తు కల్పించారు.

వైభవంగా చండీహోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: పౌర్ణమి సందర్భంగా శనివారం మరిడమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాల మధ్య వైభవంగా హోమాన్ని నిరహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా మాదాలమ్మ జాతర



అమ్మవారి సిరితాడి ఊరేగింపు

కొత్తపల్లి: గోర్స గ్రామ దేవత మాదాలమ్మ జాతర మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సిరితాడిని మోసుకుంటు భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారి సిరితాడిపై పసుపు నీళ్లు పోసి దర్శించుకున్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు



విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహిస్తున్న నాగమణి

పెద్దాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం పాటల పోటీలు నిర్వహించారు. బి.నాగమణి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 30 మంది వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. గ్రంథాలయం సిబ్బంది సింగం బుల్లియ్య, పాఠకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబుకు గీసాల కృతజ్ఞతలు

కాకినాడ రూరల్: వరసగా రెండోసారి కాకినాడ రూరల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ఇంద్రపాలెం గ్రామ నాయకుడు గీసాల శ్రీను కృతజ్ఞతలు తెలియజేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఇంద్రపాలెం గ్రామ నాయకులతో కలసి వచ్చి కన్నబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఏఎంసీ చైర్మన్‌గా రైతులకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

భవన నిర్మాణాలు సత్వరం పూర్తిచేయండి



కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: అసంపూర్తిగా వదిలేసిన ప్రభుత్వ భవన నిర్మాణాలను సత్వరం పూర్తిచేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సచివాలయాలు, ఆర్బీకే భవనాలు, వెల్నెస్ సెంటర్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆ వివరాలు తెలియజేయాలన్నారు. 2019లో నిర్మాణాలు ప్రారంభించామని, నేడు మెటీరియల్ ధరలు పెరగడంతో ప్రస్తుత రేట్ల ప్రకారం అంచనాలు తయారుచేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. గతంలో మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులను పరిశీలించి బిల్లు చేసేవారని, ప్రస్తుతం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎంబుక్‌లు తయారు చేసి బిల్లులు చేయడంలో జాప్యం చేయడం వల్ల పనుల్లో జాప్యం జరుగుతోందని ప్రజా ప్రతినిధులు ఆరోపించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, మండల ఇంజినీరింగ్ అధికారి కె.మణిమాల, పరిపాలనాధికారి వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం

ఆర్డీఓ జేవీఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టారీత్యా నేరమని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని ఆర్డీఓ జె.సీతారామారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పి.సరిత అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై శనివారం ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎన్.సుదీప్తి అధ్యక్షతన అవగాహనా సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓలు మాట్లాడుతూ బాలికలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొత్తగా స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా జిల్లా వైద్యాధికారి అనుమతి పొందాలని, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదన్నారు. దీనిని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అనంతరం కిషోర బాలికలకు గర్భ నిర్ధారణపై అవగాహన కల్పించారు. న్యాయ సలహాదారు రవికుమార్, కందుల వెంకటాచలం, వైద్యులు సాయి కిరణ్, సుప్రియ, హెచ్‌వీ వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల ఢీ ఘటనపై హెల్ప్‌లైన్ ఏర్పాటు



సామర్లకోట బుకింగ్ కౌంటర్ వద్ద రద్దు అయిన రైళ్ల వివరాలు తెలుసుకొంటున్న ప్రయాణికులు

సామర్లకోట: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై ప్రయాణికుల సమాచారం తెలుసుకునేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై స్టేషన్ మాస్టర్ రూమ్ వద్ద ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్‌ను పెట్టారు. ఈ ప్రమాదంపై సాయంత్రం వరకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని చెప్పారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం

బోట్‌క్లబ్: నిత్యం ఐదు నుంచి ఆరు కిలోమీటర్లు సైకిల్ తొక్కడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్ అన్నారు. ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, వైద్యులు సువర్ణ, సిరాజ్, రఘురామ్, పద్మావతి పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఐడీఏ సభ్యులు



విద్యార్థులతో అడబాల రత్నప్రసాద్ తదితరులు

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైకిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, రాఘవరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక అయిన ముమ్మిడి ప్రిన్స్

సామర్లకోట: విద్యార్థులకు ప్రోత్సాహకం ఇస్తున్న ఎన్‌ఎంఎంఎస్ పథకానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం ఎన్‌ఎంఎంఎస్‌కు ఫలితాలు విడుదల అయ్యాయి. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ముమ్మిడి ప్రిన్స్ ఎంపిక అయ్యాడు. దాంతో ఆ పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ ప్రిన్స్‌ను అభినందించారు. అదే విధంగా జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎ.సత్యమానస, కసిరెడ్డి గాయత్రి, పురుషోత్తం పూజశ్రీ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం మీనామాధురి తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి అయ్యే వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతుందని హెచ్ఎంలు తెలిపారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభం

కాకినాడ రూరల్: స్మార్ట్‌సిటీ నగర్ కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని జయప్రకాష్‌నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. జయప్రకాష్ నగర్‌లో మూడు వీధుల్లో సుమారు రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణానికి గతంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శంకుస్థాపన చేశారు. పనులను ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టడంతో మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వడ్డి మణికుమార్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దైవకృప, బాలే భువనేశ్వరి, టేకుమూడి దుర్గ, సిరిగినీడి దుర్గారావు, భీమరాజు, గుత్తుల ప్రసాద్, యల్ల శ్రీనివాసరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



జయప్రకాష్‌నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ మణికుమార్ తదితరులు

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



కరపలో రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ‘వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం’ ద్వారా సమగ్ర రీసర్వే చేయించి, హక్కు పత్రాలు ఇస్తున్నట్టు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం రైతులకు భూహక్కు పుస్తకాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రీసర్వే పేరుతో కొంతమంది వీఆర్వోలు రైతులను వేధిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతో కోట్ల రూపాయలు వ్యయం చేసి, సర్వే చేయించి, సరిహద్దులు నిర్ణయించి, మక్కురాళ్లు పాతించడం జరుగుతోందన్నారు.

ఏ ఒక్క రైతు నష్టపోకుండా సర్వేచేసి, ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో భూ యజమానులకు నచ్చచెప్పాలని ఎమ్మెల్యే సూచించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 19 రెవెన్యూ గ్రామాల్లో ఇంత వరకూ 15 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 11,572 మందికి శాశ్వత భూ హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉండగా ఎమ్మెల్యే కన్నబాబుతో లాంఛనంగా పంపిణీని ప్రారంభించామన్నారు. తర్వాత స్థానిక నాయకులతో కలసి అందరికీ హక్కుపత్రాలు ఇస్తామన్నారు. ముందుగా రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణీలకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యుడు బొండా చంటిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బడి తొలిరోజే జేవీకే కిట్లు అందజేయాలి

డీఈఓ అన్నపూర్ణ



సామర్లకోటలో జేవీకే కిట్ల నిల్వను పరిశీలించిన డీఈఓ అన్నపూర్ణ

సామర్లకోట: పాఠశాలలు తెరిచిన తొలి రోజే విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందజేయాలని డీఈఓ అన్నపూర్ణ అన్నారు. శనివారం జగనన్న కిట్ల నిల్వను ఆమె పరిశీలించారు. స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బూట్ల స్టాక్‌ను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మండల పరిధిలో విద్యార్థుల సంఖ్య, కిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వై శివరామకృష్ణయ్య, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌గా రామారావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రామారావు

సామర్లకోట: మున్సిపల్ కమిషనర్‌గా జె.రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రామారావుకు మున్సిపల్ మేనేజర్ అచ్యుతరాజు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాస్, ఆర్వో పూడి రవిబాబు, టీపీఓ ఫణికుమార్ అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

సామర్లకోట: జెడ్పీటీసీ సభ్యులు చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జెడ్పీ సీఈఓ ఎన్.సత్యనారాయణ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఉమ్మడి ఐదు జిల్లాల జెడ్పీటీసీలకు మొదటి బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని హక్కులు, బాధ్యతలు, విధులను వివరించారు. జిల్లా పరిషత్తు సమావేశాల్లో మంచి ప్రశ్నలు వేసి సమస్యలు పరిష్కరించడం ద్వారా ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు శ్రీదేవి, పి. శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జాతా

పెద్దాపురం: ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఇచ్ఛాపురంలో ప్రారంభించిన జాతా శనివారం పెద్దాపురానికి చేరుకుంది. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జాతా నాయకులు దడాల గోవిందు, శేఖర్, రాజ్యలక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.